సర్దుబాటు ఎప్పుడో..?

- ముగ్గురు ఉపాధ్యాయులను ఇతర మండలాలకు సర్దుబాటు
- చదువుకు దూరమవుతున్న 'గిరి' విద్యార్థులు



తాళం వేసి ఉన్న టీడబ్ల్యూపీఎస్ పాఠశాల

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన తెగలలోని ఆ తెగకు చెందిన పిల్లలు చదువుకునేందుకు అంతగా ఆసక్తి చూపారు. విద్యా ప్రాముఖ్యతను తెలుసుకున్న తలిదండ్రులు వారిని చదివించేందుకు ముందుకు వస్తున్నారు. అయితే అలాంటిది గ్రామంలో బడి ఉన్నప్పటికీ అక్కడ ఉపాధ్యాయులు మాత్రం లేకపోవడంతో గిరి పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

విద్యకు దూరమవుతున్న చిన్నారులు

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో 22 ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ కాంప్లెక్స్ పరిధిలోని జంబుల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని అడ్డగుట్ట గ్రామంతో పాటు చుట్టూ పక్కాల గ్రామాలకు చెందిన సుమారు 25 నుంచి 30 మంది విద్యార్థులు చదువుకునే వారు. ఇక్కడ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు మట్టిలో, గడ్డి పొదలలో ఆడుకుంటూ చదువుకు దూరమవుతున్నారు. అలాగే మండలంలోని చించుఘాట్ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో 26 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉండగా అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దొండరి గూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఇటీవల మృతి చెందడంతో అక్కడ ఉపాధ్యాయుని పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మరో మండలానికి డిప్యూటేషన్..

మండలంలోని మామిడిగూడ కాంప్లెక్స్ పరిధిలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను ఇతర మండలానికి డిప్యూటేషన్‌పై పంపించారు. అందులో ఒకరిని ఇంద్రవెల్లి మండలం దొడందా, మరొకరిని చాంద్‌పల్లి టీడబ్ల్యూపీఎస్‌కు, మరొకరిని మావల మండలంలోని బట్టిసారవ్‌గాం శివారు ప్రాంతంలోని కుమురం భీం గూడకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇదిలా ఉండగా మండలంలోని రెండు టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ అక్కడ డిప్యూటేషన్ ఇవ్వకుండా ఇతర మండలానికి డిప్యూటేషన్‌పై పంపడంతో తమ పిల్లలకు అన్యాయం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడికి తాళం ఉంటోంది



మా ఊరిలో ఉన్న బడికి సార్ రాకపోవడంతో ప్రతిరోజు తాళం వేసి ఉంటుంది. దీంతో పిల్లలు మట్టిలో, గడ్డి పొదలలో ఆడుకుంటున్నారు. సార్ లేకపోవడంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయుడిని నియమించాలి.

– మడావి జంగు, అడ్డగుట్ట గ్రామ పటేల్

సర్దుబాటు చేస్తాం

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అడ్డగుట్ట, దొండరిగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేని మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లినాం. రెండు, మూడు రోజుల్లోగా అక్కడ ఉపాధ్యాయులను నియమిస్తాం.

– నిహారిక, ఏటీడీవో, ఆదిలాబాద్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అటవీశాఖ అధికారి గులాబ్‌సింగ్

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ అధికారి శ్రీగులాబ్ సింగ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృక్షార్చన కార్యక్రమానికి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆవరణలో మొక్కలు నాటారు. ఈ అనంతరం మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రకాశ్ కలేవార్, ఆశోక్ మందా, భగవాన్‌దాస్ దుర్గే, బుకా గంగయ్య, ప్రేమ్‌రాజ్ గౌడ్, బెజ్జంకి రవీంద్ర, పుప్పల నరేందర్, వెంకటరమణ, బండారి దేవన్న, సత్యనారాయణ, సోమయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోథ్: సొనాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్‌కు తీసుకువస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేశ్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో 'మేమెంతో మా కంత' అన్న నినాదంతో బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి రిజర్వేషన్లు ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, రామయ్ రాము, పోశెట్టి, జుంగాల భోజన్న, అమృత్ రావ్, చెట్లపెల్లి సుధీర్, అనిల్, ముండే శ్రీధర్, రాందాస్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బేల మండలం అశోక్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాలనీలో అభివృద్ధి పనులకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండవార్ అనోజ్, రేసు అమ్రేష్ రెడ్డి, కట్కూర్ల స్వామి, ఉషాన్న, కన్నె శ్రీనివాస్ రెడ్డి, రేసు అనిల్ రెడ్డి, పాత్‌రాజ్ నవీన్, మాడవార్ హరీశ్‌రెడ్డి, అగర్కర్ ఆకాష్, కుర్మా సాయిరెడ్డి, గుంజేవార్ నరేశ్, కృష్ణ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మంత్రి


మంత్రితో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే కుటుంబసభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

బాబు పాల కోసం ఆర్థిక సాయం

ఆదిలాబాద్ రాంనగర్ కాలనీకి చెందిన కుమ్ర సుజాత తన బాబుకు పాల కోసం ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యేను సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు.

రాంజీగోండు భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీ సోయం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివాసీ రాంజీగోండు భవన నిర్మాణానికి ఆదివారం మాజీ ఎంపీ సోయం బాపురావు ఆదివాసీ సంఘాల నేతలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భవన నిర్మాణానికి ఎస్డీఎఫ్ కింద రూ. 5 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీల సంక్షేమానికి నిధులు మంజూరు చేసి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 27న పట్టణంలోని ఎస్టీయూ భవనంలో రాజ్‌గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపురావ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కంది శ్రీనివాస రెడ్డి, మడావి రాజు, సిడాం రాంకిషన్, కుర్సేంగే తానాజీ, సొనేరావు, ఆనంద్ రావు, బాలురి గోవర్ధన్ పాల్గొన్నారు.

అడుగడుగునా గుంత



నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ నుంచి గంగాపూర్ వరకు రెండు కిలోమీటర్ల రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నార్నూర్, గాదిగూడ మండలాలకు ఈ రోడ్డు మార్గం ద్వారానే రాకపోకలు కొనసాగిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– నార్నూర్

ఘనంగా బోనాల పండుగ


బోథ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్/జైనథ్/బోథ్/ఆదిలాబాద్‌రూరల్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఆషాఢ మాసంలో దేవతలు పుట్టింటికి వస్తారని ఇంటికి వచ్చిన కూతురిలాగా దేవతలను పూజిస్తారు. గ్రామంలోని మహిళలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో, జైనథ్ మండలంలో, బోథ్ మండల కేంద్రంలో, మావల మండలంలోని తిరుమలనగర్ కాలనీ బోనాల పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాకాలంలో పంటలు బాగా పండాలని, అదే విధంగా ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నారు. బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకులు సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


ఆదిలాబాద్: బోనం సమర్పిస్తున్న మహిళలు


ఆలయంలో భక్తుల సందడి


ఆదిలాబాద్‌రూరల్: పాల్గొన్న కాలనీవాసులు

ముఖరా(కె)లో 'గిఫ్ట్ ఏ స్మైల్'


కేసీఆర్ కిట్ అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఈ నెల 24న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ముఖరా(కె)లో ఆదివారం 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి 24 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తల్లి, శిశువుకు అవసరమైన వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను అందించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ గొప్ప పథకాన్ని నిలిపివేసి మహిళలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైకిల్ పంపిణీ


చైత్రకు సైకిల్ అందజేస్తున్న మౌనిష్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

ఆదుకోండి.. 'ఆసరా'నివ్వండి అనే శీర్షికన గతనెల 24న ప్రచురితమైన కథనానికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి స్పందించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ఓసావార్ రాజేశ్ కూతురు చైత్రకు ఆదివారం సైకిల్ పంపిణీ చేశారు. రాజేశ్‌తో పాటు ఆయన కుమారుడు శ్రవణ్, కతురు చైత్ర మరుగుజ్జులు కావడంతో మానవతాదృక్పదంతో ముందుకు వచ్చి ఆదుకున్నారు. సదరం సర్టిఫికెట్లు, భవిష్యత్‌లో ఎలాంటి అవసరమున్నా అండగా నిలుస్తానని తెలిపారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో రోడ్డు దుస్థితిపై ఈనెల 6న 'రోడ్డు ఇలా.. నడిచేదెలా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గుంతలమయంగా మారిన రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టా రు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పల్లెవెలుగులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు


బస్‌కు పెట్టిన ఎక్స్‌ప్రెస్ బోర్డు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి నడుపుతున్నారు. పల్లెవెలుగు బస్సు అని ఎక్కుతున్న ప్రయాణికులు అధిక చార్జి పడుతుంది. ఆకుపచ్చ కలర్ చూసి ఆర్డినరీ అని ఎక్కి ప్రయాణికులు అవక్కవుతున్నారు. అధికారులు స్పందించి పల్లెవెలుగుగానే కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రికి కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. మావల మండల కేంద్రంలోని బైపాస్ వద్దకు చేరుకున్న ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, పసుల చంటి, డేరా కృష్ణారెడ్డి, అఖిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంత్యక్రియలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చట్ల గజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడు చట్ల గజ్జయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డ్రెయినేజీ పూడిక తీయించాలి


రోడ్డుపై పారుతున్న మురుగునీరు

సాత్నాల: భోరజ్ మండలంలోని కోరట గ్రామంలో డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి కాలువల పూడికలు తీయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడిక తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై


ఎస్సై శ్రీసాయి

బోథ్: నూతన ఎస్సైగా శ్రీసాయి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్సైగా విధులు నిర్వహించిన ఎల్. ప్రవీణ్ కుమార్ మావల మండలానికి బదిలీ అయ్యారు. నూతన ఎస్సై మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతామన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

కర్రకే విద్యుత్ తీగలు


కర్రకు ఏర్పాటు చేసిన తీగలు

జైనథ్: మండల కేంద్రంలోని బర్కం పోచమ్మ కాలనీ ఏర్పడి 15 సంవత్సరాలు గడుస్తున్నా.. కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలేదు. కాలనీవాసులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు సమస్యను విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్రలకే విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

సన్మానం

బోథ్: ఇటీవల నూతనంగా ఆత్మ చైర్మన్‌గా నియమితులైన గొర్ల రాజుయాదవ్, డైరెక్టర్‌గా నియమితులైన కత్తూరి శ్రీకాంత్‌లను బోథ్ మండల కేంద్రానికి చెందిన శ్రీ రాఘవేంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి సచిన్, సభ్యులు కుమ్మరి పోశెట్టి, ఎర్రన్న, రవీంద్ర ప్రసాద్, కత్తూరి విశ్వనాథ్, జగదీశ్వర్ రెడ్డి, బారె గోవర్ధన్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు భీమన్న పండుగ

ఆదిలాబాద్: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం భీమన్న పండుగ వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ పట్టణ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటలో తెలిపారు. పట్టణంలోని కోలిపురా కాలనీ నుంచి పాదయాత్ర బయలుదేరి అశోక్ రోడ్, వినాయక చౌక్ మీదుగా గాంధీ పార్కులోని భీమన్న ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పూజా కార్యక్రమాలు ఆరంభమవుతాయన్నారు.

కేబినెట్ ఆమోదంపై హర్షం

ఖానాపూర్: 42శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ మజీద్, చిన్నం సత్యం, కావలి సంతోశ్, షబ్బీర్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి, సలీమ్‌ఖాన్, షౌకత్‌పాషా, శ్యామ్, శంకర్, చరణ్, తారాబాయి, రవి, మీర్జాబేగ్, శేషాద్రి, నారాయణ పాల్గొన్నారు.